
# కొత్త దంపతులు

పుసులూరి రామమోహనరావు



'పులి కడుపున మేక పిల్ల పుడుతుందా?' అని కొందరప్పుడప్పుడు ఆశ్చర్యపడుతుంటారు. మరి ఆ ఇంట్లో పులికి ఒక్క మేకపిల్లేం ఖర్మ, మరొక తోడేలు పిల్ల కూడా పుట్టింది. దానికేమంటారు?

అదుగో, ఆ అయిదంకణాల పెంకుటింటి వీధి గుమ్మాని కెదురుగా ఎత్తుటరుగు మీద, వద్దనుకున్న తద్దినమేదో వచ్చిపడినట్లుగా, మొహం మాడ్చి పెట్టుకుని, కొంపేదో అంటుకు పోయినట్లు దిగాలు పడి కూర్చున్నాడే - ఆయనే, ఆ నరసయ్యే పులి. ఐతే ఒకటి. అతడు వీధిలోనే పులి. ఇంట్లో మాత్రం పిల్లి. ఈ సంగతి అతనికి తెలుసు. పున్నమ్మకూ తెలుసు.

'ఇదిగో, మిమ్మల్నే. ఒకసారిలా లోపలికొస్తారూ?' అంటూ లోపల వంట గదిలో నుంచొక పొలికేక పెట్టింది పున్నమ్మ.

'వచ్చెవచ్చె' అని వణుక్కుంటూ లోపలికెళ్లాడు నరసయ్య. ఇదే గనక, మరొకరింట్లో జరిగుంటే, తన తడాఖా చూపేవాడే నరసయ్య. చిటికెలో పరిష్కరించి మరో మాటకు తావు లేకుండా తీర్పు చెప్పేవాడే. కాని అది తన ఇంటనే జరిగె. అతనికి దిక్కు తోచకుండా ఉంది.

'అప్పుడేమో నెత్తిన మేకు కొట్టుకున్నట్లు నిలువుగుడ్లేసుకుని చూస్తా వుంటిరి. ఇప్పుడదేమో నట్టింటో తిష్టవేసె. వదిలించుకునే ఆలోచన ఏమన్నా వుందా లేదా? ఇంట్లో కడుగు పెట్టినప్పుడే నాలుగంటించి నెట్టేస్తే వచ్చిన దారి పట్టేదో, ఆ కాలవలో దూకి చచ్చేదో, పీడా వదిలిపోయేది...'

'ఒసేవ్, అలా అరవకే, అందరూ వింటున్నారూ' అంటూ మధ్యగదిలోకి చూశాడు నరసయ్య. గదిలో గోడవారగా సిరిచాప మీద అటు తిరిగి పడుకుని ఉంది కొత్త కోడలు. 'అబ్బాయి వాళ్లు వచ్చాక ఏం చేయాలో ఆలోచిద్దాం. కొంచెంసేపు ఓపిక పట్టు' అన్నాడు మళ్ళీ భార్యను ఓదార్చే ఉద్దేశంతో.

'ఏమిటి ఆలోచించేది? తన్ని తగలేయడమే. ఈ నంగివేషాలు నాకు నచ్చవు. ఎంత ధైర్యం గాకపోతే యిలా దిగవిడిచి అలా వెళ్తాడు. చూస్తా, వాళ్లను రానీ' అంటూ గుంజుకుంటూనే ఉంది పున్నమ్మ. పిల్లిలా మళ్ళీ గుమ్మంవైపు జారుకున్నాడు నరసయ్య.

అసలు జరిగిందేమంటే, నాలుగు నెలల క్రితం బుద్ధిగడ్డి తిని పెద్ద కొడుకు గోపాలానికి పెళ్ళి చేశారు. వీళ్లకైతే అసలు వాడికి పెళ్లి చేయాలనే లేదు. కొంచెం మైండు తక్కువ పుటకైతేనేం, పన్లోకి వంగితే ఇద్దరు మనుషులు చేసేది ఒక్క చేత్తో అవలీలగా చేసి పారేస్తాడు. రెండోవాడున్నాడంటే వాడు పొలమే వెళతాడో, పట్నమే పోతాడో ఎవరికీ తెలియదు. ఇక తండ్రికి ఊరి మీద పెత్తనాలే సరిపోయె. ఇంకో భయం గూడా వుంది పున్నమ్మకు. ఈ కళ్లతో ఎన్ని జూడటం లేదు? పెళ్లైన నెల తిరక్కుండానే వేరు కాపురం పెట్టడం, లేకపోతే ఏకంగా అత్తగారింట్లోనే మకాం పెట్టటం. సంపాదన కోసం చచ్చిపోతున్నారీ కాలం పిల్లలు. గోపాలమసలే తిక్క వెధవ. వెళ్ళి పెళ్లాం కొంగులో దూరాడంటే, ఇంక పొలం బీడు బెట్టుకోవాల్సిందే. అందుకే వాడి పెళ్లి సంగతి పట్టించుకోలేదు. అనుకోగూడదు గాని, ఒకటి రెండు సంబంధాలు తనే చెడగొట్టింది కూడా. ఐనా ఏం లాభం? కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదంటారు పెద్దలు. ఆ మాట అక్షరాలా నిజం.

కాకపోతే, ఎక్కడో వెంకటగిరి నుంచి ఊడిపడ్డాడు పిల్ల నిస్తామని పిల్ల అన్న. తల్లిదండ్రులు లేరు. పైసా కట్నం లేదు. పెళ్లి మాత్రం ఎలాగో చేసి పంపిస్తాడు. వచ్చి పిల్లను చూసుకోమన్నాడు. ఇది జరిగేదంటలే అనుకుంటూనే వీరు వెళ్లారు. పిల్ల లక్షణంగా ఉంది. పుష్టిగా ఉంది. చక్కగానూ ఉంది. ఇదంతా గాదుగాని, ఆ క్షణంలో పున్నమ్మ కళ్లు మూసుకుపోయాయనే చెప్పాలి. నిండతా ముప్పయ్యేళ్లు నిండలేదు గోపాలానికి. అప్పుడే ఏం తొందరొచ్చి పడింది? అక్కడికీ ఏ మాటకామాటే చెప్పుకోవాలి. పిల్లకు, అన్నకు గోపాలాన్ని గురించి ఏమీ దాచకుండానే చెప్పారు. ఆ మాటకొస్తే ఒకటి రెండు మాటలు ఎక్కువే చెప్పారు. ఐనా పిల్ల ఒప్పుకుంది. పెళ్ళి జరిగిపోయింది. తర్వాత కార్యక్రమాలు సజావుగానే జరిగిపోయాయి. ఇంతవరకు పున్నమ్మ ఏదో సరిపెట్టుకునే వున్నది. ఇంకా పెళ్ళికూతురు పుట్టింట్లోనే ఉంది. గోపాలమూ అక్కడే ఉన్నాడు. ఇక్కడ నరసయ్య గారింట్లో ఒక అనుకోని సంఘటన జరిగిపోయింది. ఎవరో ఇద్దరు మతిమాలిన వాళ్లు నరసయ్య ఇంటిని వెతుక్కుంటూ వచ్చారు. గోపాలానికి మొన్ననే పెళ్ళైందని విని గతుక్కుమన్నారు. 'అరరె, మా అమ్మాయి నిద్దామని వచ్చామే, యాభై వేలు కట్నమూ ఇద్దామనుకున్నాము' అనేశారు. ఇది జరిగిందగ్గర్నుంచీ పున్నమ్మకు కాలు నిలవటంలేదు. కంటి మీదకు కునుకు రావటంలేదు. కళ్లుమూసినా, తెరిచినా, యాభై వేలు కట్టలు కట్టలుగా కన్పిస్తున్నాయి. అక్కడికి ఆ సంబంధము చెయి దాటిపోకుండా విశ్వప్రయత్నం చేసింది. 'మీరు కావాలని వచ్చారు, ఇప్పుడేం ముంచుకుపోయింది. మా రెండో వాడున్నాడు. చేసికోండ'న్నది. అతడికింకా యిరవై నిండలేదు, వద్దన్నారు వాళ్లు. పిల్లకు పాతిక దాటాయి, కుదరదనీ అన్నారు. అంతటితో ఆశలొదులుకునే రకమా పున్నమ్మ? కానే కాదు. పెనిమిటిని, కొడుకునూ పెరట్లోకి లాక్కెళ్లి మంతనాలు చేసింది. క్షణంలో తిరుగులేని ఒక నిర్ణయమూ తీసుకుంది. వెంటనే నవ్వు పులుముకుంటూ వచ్చి, వాళ్లు ఫలహారాలు ముగించి కాఫీలు పుచ్చుకుంటుండగా, కులుకుతూ అంది-

'ఇంకేం అన్నయ్యగారూ! మీరు గోపాలమే కావాలంటున్నారు. మా ఖర్మగాలి మొన్ననే వాడికి పెళ్ళి చేశాం. అస్సలు మాకెవరికీ ఇష్టం లేదంటే నమ్మండన్నయ్యగారూ! మా గోపాలమూ వొద్దు వొద్దని మొత్తుకుంటున్నా మేమే మెడలు వంచి తాళి కట్టించాము. ఇప్పుడేం ముంచుకుపోయింది లెండి. మీరొక్క ఆరు నెల్లాగి రండి. ఈలోగా మేమా పిల్లని - అసలది పిల్లే అనుకుంటున్నారా అన్నయ్యగారూ - కానే కాదు. కొండముచ్చు. పైగా గుడ్డిది కూడానూ - సర్లెండి. ఇప్పుడింక దాని మాటెందుకుగాని, దాన్నెట్లాగో వదిలించుకుంటాం. మీరన్నట్లు మా గోపాలానికి మళ్లీ పెళ్లి చేద్దాం...'

ఆ వచ్చిన వారిలో ఒకడు ముక్కోపిలా వున్నాడు. ఇంతెత్తున లేచి పడ్డాడు. 'చాల్చాల్లేవమ్మా, మహా దొడ్డ మనిషివి, నిన్ను గనక జూస్తున్నాను. రేపు మరొకడు ఇంకో యాభై వేలంటే, మా పిల్లను వదిలించుకుని కొడుక్కి మళ్లీ పెళ్ళి చేస్తారు. ఇటువంటి వాళ్లను పోలీసులకు పట్టించాలసలు...' అలా అని చక్కా పోయారిద్దరూ.

'నే చెబితే విన్నావుటే. ఇప్పుడు జూడు' అన్నాడు నరసయ్య కొంచెం సిగ్గుపడుతూ.

'చెప్పింది చాలుగాని, యిక నోరు మూసుకోండి. లోకం గొడ్డుబోయిందా ఏమిటి? బయల్దేరారు లోకాన్ని ఉద్ధరించడానికి. యాభై వేలిచ్చే మొహాలే వీళ్లవి. వీళ్లు గాకపోతే మరొకరు. ఏమన్నానో అన్నాను. ఆరునెల్లు తిరక్కుండానే గోపాలానికి మళ్ళీ పెళ్ళి చేయాల్సిందే. ఏమంటావురా?' అన్నది కొడుకు నుద్దేశించి.

'అంతేనే అమ్మా! ఆ మాట మీదనే వుండు' అన్నాడు రెండో కొడుకు వెంకయ్య. ఆ రోజునే పున్నమ్మ శపథం చేసింది.

వెంకటగిరి నుండి వచ్చీ రాగానే గోపాలాన్ని వంట గదిలోకి తీసుకెళ్లి, అరుగు మీద కూర్చోబెట్టి, రెండు లడ్డూలు చేతిలోబెట్టి, చిలక్కు చెప్పినట్టు చెప్పింది.

'ఒరేయ్ గోపాలం! ఆ పిల్లతో నీ పెళ్ళి చేసి పెద్ద తెలివి తక్కువ పని చేశామురా'

'తెలివితక్కువ పనులు చేస్తావని నన్ను అంటారు గదే. మరి మీరెందుకు తెలివితక్కువ పని చేశారు?' ఠకీమని అడిగాడు గోపాలం. అసలే పెద్దవిగా ఉన్న కళ్లు మరింత పెద్దవి చేసుకుంటూ.

'నేను చెప్పేది పూర్తిగా విను మరి. నీ పెళ్ళాం జాతకం మంచిది గాదుట. అది మన గడప తొక్కితే మీ నాయనకు గండంట. మరి మీ నాన్న చచ్చిపోతే మీరెట్లా బ్రతుకుతారూ?' అని అడిగింది పున్నమ్మ తెలివిగా.

ఒక్క క్షణం ఆగి, 'ఐతే ఒక పని చేద్దామే అమ్మా! మన ఇంటికున్న గడపలన్నీ లాగి పారేద్దాం. అప్పుడెలా తొక్కుతుంది?' అన్నాడు గోపాలం ఇంకా తెలివిగా.

బుగ్గ పొడిచి, 'వొరే పిచ్చి సన్నాసి, అందుకేరా నిన్నందరూ తిక్కవాడివనేది. గడప తొక్కటమంటే కాలితో తొక్కటం గాదురా. అది మన ఇంట్లోకి రాగూడదని. మన ఇంటిలో నీతో కాపురం చెయ్యగూడదని' అని వివరించింది.

ఈసారి రెండు క్షణాలాగి తలవూపుతూ అన్నాడు గోపాలం. 'నాన్నకు గండం తప్పాలంటే వుపాయం వుందే అమ్మా! దాన్ని ఇక్కడికి రానియ్యొద్దు. నేనే అక్కడికి వెళ్ళిపోతా'

గతుక్కుమంది పున్నమ్మ.

'నీ తెలివి తెల్లవారినట్లే వుంది గాని, ఇంక పొలంబో' అని లేచిపోయింది పున్నమ్మ. ఆమెకు ఒక్క విషయం స్పష్టంగా బోధపడింది. ఈ నాలుగు రోజులకే గోపాలంలో మార్పు వచ్చింది. ఎన్నడూ లేంది, ఎదురు చెప్పటం నేర్చుకున్నాడు. అటుదిప్పి, ఇటు దిప్పి చివరకు పెళ్లాన్నే వెనకేసుకొస్తున్నాడు. ఇక వీడితో పనిగాదు. అటు నుంచి నరుక్కు రావాలని నిశ్చయించుకుంది. చిన్నకొడుకుతో మంతనాలు చేసింది. ఇరవై వేలు రొక్కం లేనిదే పిల్లను కాపురానికి తీసుకురావద్దని వెంకటగిరికి కబురు చేసింది. వాళ్ల స్థితిగతులు తనకు తెలుసు. ఏ పొద్దు కూలికెళితే గాని ముద్ద నోటికి పోని రకాలు. ఆ అన్న ఇరవై వేలు తెచ్చేనూ, ఆ చెల్లి కాపరానికి వచ్చేనూ అనుకుని స్థిమితపడుతూ వుండగా, ఈ రోజు సాయంత్రం, మబ్బులేని వానలా, అన్నా చెల్లెలు నడిమింట్లో కొచ్చి పడ్డారు. మూసి ముల్లు గొట్టుకుపోయిన ఆకాశంలా నరసయ్య తెల్లబోయి నిలబడిపోయాడు గాని, పున్నమ్మ మాత్రం శాయశక్తులా వారిని నిలవరించే ప్రయత్నం చేసింది. ఎట్లా కాపురం చేస్తుందో చూసుకో అన్నది. నరికిపోగులు పెట్టకపోతే కాసుకో అన్నది. ఇంకా ఏమో అన్నది. ఐతే ఏం లాభం? దున్నపోతు మీద వాన పడినట్లు ఆ అన్న తొణకలేదు. నింపాదిగా చేతిలోని ట్రంకుపెట్టె బల్ల మీద పెట్టి - 'ఇదిగో నమ్మా, మీ కోడలు. కడుపు చల్లగా కాపరమే చేయించుకుంటారో, కత్తికో కండగా నరికి కాకులకే వేస్తారో - మీ దయ. కట్నం ఇరవైలా కావాలని కబురు పెట్టారు. అప్పుడు మనం అచ్చుకోలేదు. ఇప్పుడు నేను యిచ్చుకోలేను. రాజమ్మా! ఇక నేను పోయొస్తానమ్మా. చల్లగా పదికాలాలు కాపురం జేసుకో తల్లీ!' అని దీవిస్తున్నట్లుగా చెల్లెలి శిరస్సుపై చేత్తో నిమిరి, అంతటితో తన పని తీరిపోయినట్లు గిరుక్కున వెనుదిరిగి బయటకు వెళ్ళిపోయాడు. పున్నమ్మ మాట పడిపోయింది. చేసేదేమీ తోచక, బయట వసారాలోకెళ్లి స్తంభానికి జారగిలబడి కూర్చున్నాడు నరసయ్య.

నిలబడీ, నిలబడీ కాళ్లు పీకినట్లయి రాజమ్మ గదిలోకెళ్లి చాప పరుచుకుని పడుకుంది.

★ ★ ★

అది సంధ్యాసమయం. చల్లగాలి తిరిగింది. ఇళ్లలోని జనం ఒకరొకరే బయటకు వచ్చి అరుగుల మీద కూర్చుంటున్నారు. అప్పటికే ఉప్పందిన గోపాలం నేలపై నడవటం లేదు. నెత్తిపై మోపు నిలవటంలేదు. 'ఆత్రగానికి ఆకులో చెట్టు, నాకు మాత్రం నేలపైన పెట్టు' అన్నట్లుంది అతని తొందర. ఇంటి ముందుకొచ్చేసరికి ఇంక నిలవలేకపోయాడు. ఒక్క ఉరుకురికి, చావడిలో గడ్డిమోపు విసిరికొట్టి, అంతే వేగంతో గుమ్మం మెట్లెక్కి, మేకపిల్లలా చెంగున పెరట్లోకి దూకి, తర్వాత వంట గది వసారాలో పరికించి చూసి, హాల్లో ఏదో సర్ది పెడుతున్న తల్లితో - 'రాజమ్మ వచ్చేసింది గదటే, నువ్వసలు రానే రాదన్నావూ?' అని, అటు గదికేసి తిరిగి, లోపలెవరో మెదిలినట్లు తోచి, ద్వారబందానికిటూ అటూ చేతులు చేర్చి, అనిమిష నేత్రుడై అలాగే నిలబడిపోయాడు గోపాలం.

ఆ సందడికి లేచి కూర్చుని, విప్పారిన నేత్రాలతో తనకేసి చూస్తున్న భర్తను జూసి, ప్రొద్దున్నుంచి తను పడుతున్న వేదననూ, భయాన్నీ, ఆకలినీ మరచి, అప్రయత్నంగా ఉబికి వస్తున్న కన్నీటిని అదుపు చేసుకోలేక రెప్పలు తటపట లాడించింది రాజమ్మ.

'ఛ! ఏడుస్తావెందుకు? ఊరుకో' అంటూ తలుపు మూసి, రెండంగల్లో భార్యను సమీపించి, దగ్గరగా ఆనుకుని కూర్చుని, చెంపలు తుడిచాడు.

'ఏడుపు గాదు, సంతోషం' అంది రాజమ్మ, అతని చేతులు తన చేతుల్లోకి తీసుకుంటూ.

'ఎందుకమ్మా సంతోషం?'

ఈ నాలుగు రోజులకే గోపాలంలో మార్పు వచ్చింది. ఎన్నడూ లేంది, ఎదురు చెప్పటం నేర్చుకున్నాడు. అటుదిప్పి, ఇటు దిప్పి చివరకు పెళ్లాన్నే వెనకేసుకొస్తున్నాడు. ఇక వీడితో పనిగాదు. అటు నుంచి నరుక్కు రావాలని నిశ్చయించుకుంది. చిన్నకొడుకుతో మంతనాలు చేసింది.

'నిన్ను చూశాను గదా. అందుకు. సరేగాని, నాల్గు నెల్ల నుంచి మా వూరు మళ్లీ రాలేదేం?' గోముగా గునిసింది.

'మా అమ్మ వెళ్లవద్దంది. నువ్వా ఇక్కడికి రాకూడదట'

'ఎందుకట?' భయంగా మొహం పెట్టి అడిగింది.

'మరేమో, నువ్వు ఇంట్లో వుంటేనట, మా నాన్నకు గండంట, ఆయన చచ్చిపోతారుట'

'ఎవరు మీకా మాట చెప్పింది?'

'మా అమ్మ' అన్నాడు గోపాలం గది తలుపులకేసి చూస్తూ.

'మీ నాన్న చచ్చిపోరు. నేనే చచ్చిపోతాను'

'ఎందుకు?'

'నన్ను చంపేస్తారు. అందుకు'

'నిన్నెందుకు చంపేస్తారు? నేను లేనూ?'

'ఐనా చంపేస్తారు. నన్ను చంపేసి నీకు మళ్ళీ పెళ్ళి చేస్తారు. ఈసారి బాగా కట్నమొస్తుందిగా, అందుకు'

'నేను చచ్చినా పెళ్ళి చేసుకోనుగా, అప్పుడేం చేస్తారు? ఐనా నీకెవరు చెప్పారు నిన్ను చంపుతామని?'

'మీ అమ్మగారు'

'నీతో అలా చెప్పిందా?'

'నాతో కాదు, మా అన్నయ్యతో చెప్పింది. ఇరవై వేలుంటే అక్కడ పెట్టి వెళ్ళమంది. లేకుంటే ఒక్క వారం రోజుల్లో నన్ను చంపేస్తారుట. ఆపై వారంలో నీకు పెళ్లట. ఏం, మరో పెళ్లి చేసుకుంటావా మరి?'

'ఛీ! అట్లా మాట్లాడకు. మీ అన్నయ్యేమన్నాడు మరి?'

'అన్నయ్య దగ్గర డబ్బు లేదుగా. తిరిగి వెళ్ళిపోదామంటాడు. నేనే వద్దన్నాను. చావో, బతుకో ఇక మీతోనే. మా అన్నా వదినెలకైతే నన్నిక్కడికి పంపటమే ఇష్టం లేదు. నానా అల్లరి చేసి, నాలుగు రోజులు తిండి మానేసి, బలవంతపెట్టి మరీ ఇక్కడికి వచ్చాను'

'ఎందుకు, చచ్చిపోవటానికా?'

చివుక్కున తలెత్తి భర్త కళ్లల్లోకి చూసింది రాజమ్మ. వయస్సుతోపాటు సడి లేకుండా మనస్సులో ప్రవేశించి క్రమానుగతంగా మనుషుల్ని వికృతపరిచే స్వార్థం, నటన, వంచన తెలియని అమాయకత్వం గోపాలానిది. అందుకు ఈ సంఘం ఇచ్చిన నజరానా 'పిచ్చివాడు, లేకుంటే వెర్రివాడు' అన్న బిరుదు. తమ ఇంట్లో ఉన్న నాలుగు రోజుల్లోనే గ్రహించింది రాజమ్మ. మొదటి నుంచి తీర్చిదిద్దుకుంటే గోపాలం ఇంత అమాయకంగా ఉండకపోనని. కాని కన్నబిడ్డల వైకల్యాన్ని కూడా సొమ్ము చేసుకునే తల్లిదండ్రులున్న కాలం ఇది. ఐతే ఏం ముంచుకు పోలేదు. దురలవాట్లతో, కుత్సితాలతో కుళ్లి కునారిల్లుతున్న ఈ సంఘంలో పులుగడిగిన ముత్యం తన భర్త. తనకూ తల్లిదండ్రుల అనురాగం తెలియదు. అన్న వదినల ఆదరణ పద్దెనిమిదేళ్లు అనుభవించింది. చాలు. తెలివితేటలకు, ధైర్యసాహసాలకు కొదవలేదు. అందుచేతనే భర్త పంచకు చేరింది రాజమ్మ. అతని ప్రశ్నకు జవాబుగా నవ్వింది.

'నవ్వుతావేం? ఎందుకూ ఇక్కడికొచ్చింది, చచ్చిపోటానికా?' మళ్ళీ అడిగాడు గోపాలం.

'కాదు, చనిపోవటానికిక్కడి దాకా రావాల్నా? బ్రతుకుదామనే ఇక్కడికొచ్చాను. మీ అమ్మగారే చంపుతానని బెదిరిస్తున్నది' భార్య చేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ అన్నాడు గోపాలం.

'నువ్వేం భయపడకు. ముందు నన్ను చంపినాకనే నిన్ను చంపేది ఎవరైనా'

ఆ మాట చాలు రాజమ్మకు. కత్తిపీట క్కూడా గోడ చేర్పు ఉండాలంటారు. ఆ మాత్రం పెనిమిటి ఆసరా వుంటే చాలు, ప్రపంచాన్ని నిలువరించి జీవించగలదు. పైకి బింకం ప్రదర్శించాడే గాని, లోన గుబులుగానే ఉంది గోపాలానికి. అందరూ అనేదే, తన అమ్మా, తమ్ముడూ మంచివారు కారని. ఇద్దరూ కలిసి ఎంత పనైనా చేయగలరు. తెలివితక్కువంటారని ఎవరికీ చెప్పుకోడు గాని, వీళ్ళిద్దరూ తననెంత వేపుకు తిన్నారో తనకు తెలియదూ? కొన్ని సంబంధాలసలు వీళ్లే చెడగొట్టారు. లేకపోతే ఇప్పటి దాకానా? ఎప్పుడో తనకు పెళ్లై పోయేది. మంచి పెళ్లాం దొరికితే చాలదూ? ఇంకా కట్నాలెందుకు? పైగా పెళ్లైనాక కూడా కట్నం చాల్లేదని కోడళ్లను చంపడం గోపాలానికి గుర్తొచ్చింది. మొన్న రెండు నెల్ల క్రితమేగా, ఈ బజారు చివర్న, సుబ్బయ్య, సూరమ్మ కలిసి కోడల్ని కిరసనాయిల బోసి కాల్చి చంపింది. ఆ పిల్ల మొగుడే అగ్గిపుల్ల అంటించాడట. ఛీ! వాడేం మొగుడు? ఈ సంగతి గుర్తు రావటంతో గోపాలానికి చెమట్లు పోశాయి. బేలగా రాజమ్మ మొహంలోకి చూసి తటాలున ఆమె రెండు భుజాలు పట్టుకుని ముందుకు లాక్కున్నాడు.

'మనం బ్రతకాల్నంటే ఈ ఇంట్లో వుండకూడదు. ఎక్కడికన్నా వెళ్ళిపోదాం'

సూర్యోదయాన ప్రొద్దు తిరుగుడు పువ్వులా రాజమ్మ మొహం కళకళలాడింది. భగవంతుడే గోపాలం నోట ఆ మాటలనిపించినట్లుంది. కొండంత భారం తీరినట్లయి, 'అలాగే వెళ్లిపోదాం' అని అతని చెంపలు నిమిరింది.

'వెళ్దాం గాని, మరి మనం బ్రతికేదెట్లా? నాకే పని చేతగాదు' అన్నాడు గోపాలం. మొదటిసారిగా గోపాలానికి దిగులు పట్టుకుంది. సంసారమంటే మాటలా మరి?

'మీకా భయం అక్కర్లేదు. ఆ బాధ్యత నాది. నా పెట్టెలో రెండు వేలున్నాయి, నేను సంపాదించి దాచుకొన్నది. ఏ ఒంగోలో, కావలో, నెల్లూరో వెళ్లిపోయి హాయిగా బతికేద్దాం. నేను టెన్తు పాసయ్యాను తెలుసునా? పట్టుదలా, కృషి ఉండాలిగాని, ఎన్నో ప్రభుత్వ పథకాలున్నాయి వ్వాళ. మనం ఆఫీసుకెళ్లి కనుక్కుంటే అన్నీ వాళ్ళే చెబుతారు.

ఈసారి ఆరాధనగా చూశాడు రాజమ్మ వైపు గోపాలం. ఏనుగెక్కినంత సత్తువ వచ్చింది.

అంతలోనే దిగులు, అంతలోనే ధైర్యం, అంతలోనే సంతృప్తి. అంతలోనే ఆనందం - అవేగదా జీవితానికి పునాదిరాళ్లు.

సంతోషం కొంచెం శృతిమించి, గోపాలం భార్యను దగ్గరకు తీసుకోబోతుండగా, మూసిన గది తలుపు భళ్లున తెరుచుకుంది. ఒక ఇరవై ఏళ్ల వాడు లోపలికి తొంగి చూస్తున్నాడు.

తటాలున జరిగి, చివ్వున తల తిప్పి చూసింది రాజమ్మ. గుడ్డిదీపం వెలుగులో నల్లటి మొహంలో ఎర్రగా మెరుస్తున్న తోడేలు కళ్లు. ఆ కళ్లలో అపరిమితమైన కాంక్ష. నిండుగా ఒక నిమిషంపాటు గోపాలాన్ని, రాజమ్మను మార్చి మార్చి చూసి, తల పంకించి, తెరిచిన తలుపు అలాగే వదిలేసి, తప్పుకు పోయాడు.

'మా తమ్ముడు వెంకయ్య'

'తెలుసు, అనుకున్నాను' గోపాలం తలుపు గడిపెట్టి వచ్చాడు.

'మంచివాడు గాదు. వీడిని చూస్తే ఆడపిల్లలు పారిపోతారు. నువ్వు జాగ్రత్తగా ఉండాలి'

ఇంకా కబుర్లు ఎంతవరకు పోయేవోగాని, అంతలో తలుపు కొట్టిన చప్పుడైంది. రాజమ్మ సర్దుకుని కూర్చుంది. గోపాలం తలుపు తెరిచాడు. మొహమంతా నవ్వు పులుముకుని, తలుపు కడ్డంగా నిల్చొని, 'ఏరా, గోపాలం! అమ్మాయి పాపం ఎప్పుడనగా తిన్నదో ఏమో. ఇక లేచి స్నానాలు చేసి, భోజనాలు చెయ్యండి' అన్నది పున్నమ్మ.

గొంతులోని ఆ మార్దవానికి రాజమ్మ రిచ్చపడ్డది. వెంటనే తెప్పరిల్లి, లేచి, ట్రంకుపెట్టె తెరచి, పుట్టింటి నుంచి తెచ్చిన కొత్తబట్టలు, స్వీట్లు, పసుపు కుంకుమలు తెచ్చి, అత్తగారి చేతిలో వుంచి నమస్కరించింది.

★ ★ ★

వేటగాడు వలపన్నే ముందు నేలను చదును చేస్తాడు. నదురుగా కనిపించేట్లు నూకలు చల్లుతాడు. సడిచెయ్యకుండా చాటున దాగి కూర్చుంటాడు. పక్షి వలలో చిక్కుకోగానే, ఒక్క ఉదుటున వచ్చి, రెక్కలు విరిచి, బుట్టలో వేసుకుంటాడు. అలాగే పున్నమ్మ మాటు వేసింది. మంచి మాటలతో మభ్యపరచింది. సమయం కోసం పొంచి కూర్చుంది. తెలివిగలదే ఐనా రాజమ్మ చిన్న పొరపాటు చేసింది.

'ఐతే మనం నెల్లూరు వెళదామంటావా?' అని భార్యను ప్రశ్నించాడు గోపాలం, మర్నాటి ఉదయం ఎవరూ లేకుండా చూసి.

'అవును, నెల్లూరే నయం. అక్కడ మా బాబాయి వాళ్లున్నారు. ముందు మనం అక్కడికి వెళ్ళి, తర్వాత ఏం జేయాల్సిందీ నిర్ణయించుకోవచ్చు'

'మనం ఇంట్లోంచి వెళితే, వీళ్లు మన వెంట పడతారంటావా?'

'ఎందుకు వెంటబడతారు? మనం ఇక్కడి నుంచి పూచికపుల్ల కూడా తీసికెళ్లటం లేదుగా. మీ బట్టలు మాత్రం నా పెట్టెలో పెట్టుకోండి'

'మాకు పొలం వుంది. ఇల్లుంది. ఇంకా దొడ్డి వుంది. ఇనప్పెట్టెలో చాలా డబ్బా ఉంది. ఇదంతా తమ్ముడికేనా? మరి మనకు వద్దా?'

పకాలున నవ్వింది రాజమ్మ.

'నేనున్నాను, చాలదూ. ఇంకా పొలాలు, డబ్బా కావాలా? మనం సంపాదించుకోలేమేమిటి? ఆ పొలం, ఆ డబ్బు మీ అమ్మవాళ్లనే ఉంచుకోనివ్వండి. వాళ్లూ పెద్దవాళ్ళై పోతున్నారు గదా'


'ఐతే మనం ఎప్పుడు వెళ్ళేదీ?'

'రేపే' అన్నది రాజమ్మ.

అక్కడే రాజమ్మ పొరపాటు చేసింది. అత్తగారి ఇచ్చకపు మాటలకు తలొగ్గడం కాదుగాని, నిరాధారంగా అనిశ్చితమైన భవిష్యత్తులోకి అడుగువేయటంలో కొంచెం అలసత్వం చూపిందనే అనుకోవాలి. రేపటి దాకానా, ఆ సాయంత్రమే ఇల్లు వదలాల్సి వచ్చింది.

మధ్యాహ్నం భోజనాలయ్యాక రాజమ్మ గదిలో పెట్టె సర్దుకుంటోంది. గోపాలం ఏదో పనుందని బయటకు వెళ్ళాడు. మామగారు బయట వసారాలో, అత్తగారు పెరటివైపు వసారాలో నడుం వాల్చారు.

అంతలో ఎవరో తలుపు నెట్టుకొని లోపలికొచ్చారు. కుర్చీలో కూర్చున్నట్టూ అనిపించింది. భర్తే అనుకుని, 'అప్పుడే వచ్చేశారే! వెళ్ళిన పని అయిందా?' అంది రాజమ్మ తల తిప్పకుండానే.



'అవుతుందో లేదో ఇంకా తెలియదు' అన్న మాటలు మత్తుమత్తుగా వినిపించాయి. చటుక్కున తలెత్తి చూసింది. కుర్చీలో మరిది.

ఒక్క ఉదుటున లేచి నిలబడి 'గదిలోకెందుకొచ్చావ్? బయటకు వెళ్లు' అన్నది బింకంగా.

'బయటికెందుకెళ్ళాలి. ఈ గది నీ సొంతమా?' అంటూ చెయ్యి పట్టుకున్నాడు.

చెయ్యి విదుల్చుకుని, 'పోతావా, పోవా? మీ అమ్మ నాన్నలను పిలుస్తాను. కేకలేస్తాను. పది మందిలో పెట్టి పరువు తీస్తాను' అంటూ అరిచింది రాజమ్మ.

'ఏమిటే నువ్వు పరువు తీసేది? నీ కేకలు నాయనికి వినపడవు. అమ్మకు తెలుసు. ఇంకా నువ్వేంటే చేసేది? గోపాలం పిచ్చిబాగులోడు. వాడితో నువ్వేం సుఖపడతావ్? ఇది మన మధ్యే ఉంటుంది. గొడవ చెయ్యకు' అంటూ రెండు చేతుల్తో వడిసి పట్టుకుని రాజమ్మను కిందకు పడనెట్టాడు. మీదబడి అలుముకుంటున్నాడు. చింతనిప్పుల్లాంటి కళ్లతో వళ్ళంతా గాట్లు పెడుతున్నాడు. 'భగవంతుడా' అనుకున్నది రాజమ్మ. తమ స్వప్న సౌధాలు ఈ కామాంధుడి వలన కూలిపోవాల్సిందేనా? వీల్లేదు. వీల్లేదు. చావో బ్రతుకో అన్న విషమస్థితిలో శక్తినంతా కూడదీసుకుని, గొంగళి పురుగును విదిల్చినట్లు వెంకయ్యను విదిల్చి కొట్టింది రాజమ్మ. ఠపీమని తల గోడకు కొట్టుకోగా, కళ్లు బైర్లు కమ్మినట్లయి, ప్రక్కకు వొరిగిపోయాడు.

క్షణం ఆలస్యం చేయకుండా, తోడేలు నోట చిక్కి, భగవదనుగ్రహం వల్ల బయటపడ్డ మేకపిల్లలా వణికిపోతూ, ఒక్క అంగలో, పెట్టెతో సహా బయటకు దూకి, వీధి వసారాలో కొచ్చి పడింది రాజమ్మ. అంతటి విపత్కర పరిస్థితిలోనూ, తలుపు లాగినప్పుడు, చాటున పొంచి నిలుచున్న పున్నమ్మ చెంగున గెంటి, ప్రక్కకు తప్పుకోవటం కళ్ళారా చూసింది. గుండెలు కుదుటపడ్డాక ఆమెకు కుట్ర అర్థమైంది. తన ప్రాణాలకే ప్రమాదం అని శంకించింది. కాని వీళ్ల కుతంత్రం అతిహేయమైనది. అమానుషమైనది. అదింకా ముక్తాయింపునకు రాలేదు. ఉప్పెనలా బైటకొచ్చిపడి, తిట్లు లంకించుకుంది పున్నమ్మ.

'ఏమిటే లాం-ఝు కానా! ఇంట్లో బిడ్డను ఏం చేసి వచ్చావే, ఇక్కడ కొచ్చి కూర్చున్నావూ? నీ వొంట్లో చీము నెత్తురు లేదూ? నీకు సిగ్గు శరమూ లేవూ? రానీ, మా గోపాలాన్ని రానీ, నీ పని చెబుతా?'

ఎవరో పిలిచినట్లే వచ్చాడు గోపాలం. అతడి రెండు చేతులూ అంది పుచ్చుకుని, మొహం దాచుకుంది రాజమ్మ. వరద ప్రవాహంలో బడి ఉక్కిరిబిక్కిరి అయ్యేవానికి చెక్కముక్క దొరికినట్లు, రాజమ్మకు గోపాలం దొరికాడు.

పున్నమ్మ తన ప్రయత్నాన్ని ఇంకా విరమించలేదు. చివరి దాకా లాగింది.

'రారా గోపాలం! సమయానికొచ్చావు. నీ పెళ్ళామెంత తప్పుడు పని చేసిందో తెలుసా? వెంకడిని గదిలోకి లాగి తలుపు మూసుకుంది. నేను చూశానని, వాడి మీద నింద లేస్తూ, అరిచి, ఇక్కడకొచ్చి కూర్చుంది. ఇదిగో చెర్నాకోలు. నాలుగు తగిలించి, జుట్టు పట్టుకుని లోపలికి ఈడ్చుకురా. దీని అబ్బ ఎవడడ్డమొస్తాడో చూస్తా. వొళ్లు కొవ్వెక్కి కొట్టుకుంటోంది, బజారుముండ' అలా అని చెర్నాకోలును గోపాలం పైకి విసిరింది.

ఒడుపుగా వడిసిపట్టి, పిడికిలి బిగించి, చెయ్యి పైకెత్తాడు గోపాలం. అప్పటికే ఇరుగు పొరుగు జమగూడారు. ఖర్చులేని వినోదం. అదేమన్న వాళ్లు లేరు. ఒకరిద్దరైతే రాజమ్మ చీర తడిసి వుందో లేదో పరిశీలిస్తున్నారు. పొరిగింటి పంకజమైతే ఇంకా కిరసనాయిల్ వాసన రాదేమబ్బా అని విస్తుపోతోంది.

ఐతే ఎక్కువమంది దృష్టి మాత్రం గోపాలం మీదే ఉంది. ఇప్పుడు తేలిపోవాలి, గోపాలం సరుకేంటో. పెళ్ళాం వంటి మీద ఎన్ని దెబ్బలు వేస్తాడు, జుట్టు పట్టుకుని తలను స్తంభానికేసి ఎన్ని మాట్లు కొడతాడు, వాళ్లు ఊహించుకుంటున్నారు. అబ్బే, వాళ్ళ ఉత్సాహమంతా చప్పున చల్లబడిపోయింది. గోపాలం వాళ్లనుకున్నట్లు చెయ్యనే చెయ్యలా.

రెండడుగులు ముందు కురికి చెర్నాకోలు బలంగా విసరడమైతే విసిరాడు గాని, గురి పెళ్ళాంపైన గాదు, తల్లి పైన. పున్నమ్మ లేచిన వేళ మంచిది. లేకుంటే ఆమె కుడి చెంప క్షణంలో నిలువునా చీరుకుని పోవలసిందే.

'అమ్మ నాయనోయ్! ఈ వెర్రిముండా కొడుకు నా ప్రాణాలు తీసేశాడే తల్లోయ్!' అంటూ పున్నమ్మ వెనక్కు దూకి ఇంట్లోకి పారిపోయింది.

చెర్నాకోలును విసిరి నేలకు కొట్టి, అప్పుడే నిద్రలేచి, అయోమయంలో పడిన తండ్రికేసి చురచుర చూశాడు. గోపాలం కౌశికుడు కాదు కనుక నరసయ్య బ్రతికిపోయాడు. ఐనా ఆ వేడి ఎక్కడో తాకినట్లు వుంది. నువ్వేం తండ్రివయ్యా అని నిలదీసినట్లూ వుంది. నరసయ్య సిగ్గుతో తలదించుకున్నాడు.

విస్తుపోయిన జనం తెప్పరిల్లి తేరుకున్నారు. వాళ్ళకిప్పుడు గోపాలం మందబుద్ధిలాగ, మతిహీనుడులాగ కన్పించటంలేదు. మేరు నగధీరుడుగా కన్పిస్తున్నాడు.

★